సాక్షి
నిజామాబాద్
గురువారం । 3 । ఏప్రిల్ । 2025



నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
నిజామాబాద్ నగరంలోని సుభాష్‌నగర్ రామాలయం బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి.
- 8లో ▸



ప్రపంచంలో దేశాన్ని..
దేశాన్ని అగ్రభాగాన నిలిపేందుకు జాతీయ సదస్సు రూట్‌మ్యాప్‌గా ఉపయోగపడాలని తెయూ వీసీ యాదగిరిరావు అన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
39.6 /21.2

వాతావరణం
ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి అధికారులకు సూచించారు. డొంకేశ్వర్‌లో ఏర్పాటైన నూతన మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నందిపేట్ నుంచి వీడిపోయి 13 గ్రామాలతో కొత్త మండలంగా ఏర్పడిన డొంకేశ్వర్‌లో ఎంపీడీవో ఆఫీసు ఏర్పాటు కావడంతో ప్రజల కష్టాలు తీరనున్నాయని అన్నారు. ఇకమీదట నందిపేట్‌కు వెళ్లాల్సిన పనిలేదని డొంకేశ్వర్‌లోనే అన్ని కార్యాలయాలు ఏర్పాటయ్యాయన్నారు. పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చిన ప్రజలకు అధికారులు పనులు చేసి పెట్టాలని, ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు అందించాలని, తప్పిదాలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఉమ్మడి మండలానికి ఎంపీడీవోగా కొనసాగిన శ్రీనివాస్‌రావు, ఎంపీవో లక్ష్మీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు కలిసి డొంకేశ్వర్ నూతన ఎంపీడీవో బ్రహ్మానందంను ఘనంగా సన్మానించారు.

నిజాంసాగర్ నీటి విడుదల



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టు అవసరాలకోసం బుధవారం ఆరో విడత నీటి విడుదల ప్రారంభించారు. ప్రాజెక్టు ప్రధాన కాలువకు 1,600 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు కింద అలీసాగర్ రిజర్వాయర్ వరకు 1.25 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టులో 1,394 అడుగుల(6.556 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.





నిర్దాక్షిణ్యంగా నరికేశారు..

మోర్తాడ్ – పాలెం రోడ్డులో పచ్చదనంతో కళకళలాడుతూ నీడనిచ్చిన చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికేశారు. హరితహారం, వనమహోత్సవం.. పేరేదైనా, ఏ ప్రభుత్వం ఉన్నా పచ్చదనాన్ని పెంచాలనే లక్ష్యంతో విస్తృతంగా మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. భవిష్యత్ తరాల కోసం ప్రభుత్వాలు సదుద్దేశంతో ముందడుగు వేస్తుండగా, క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం లక్ష్యాన్ని నీరుగారుస్తోంది. మోర్తాడ్ – పాలెం రోడ్డులో బుధవారం ఇలా 40 నుంచి 50 చెట్లను నరికివేయడాన్ని చూసిన వారు ఇదేమిటని విస్తుపోయారు. విద్యుత్ తీగలకు కొమ్మలు తగులుతాయని, పంటలపై చెట్ల నీడ పడుతోందని ఇలా మొదలుకు నరుకుతూ పోతే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. – మోర్తాడ్

నో పర్మిషన్.. అయినా అడ్మిషన్!

- జిల్లాలో విచ్చలవిడిగా ప్రైవేట్ పాఠశాలల ఏర్పాటు
- అనుమతులు లేకున్నా పిల్లలను చేర్చుకుంటున్న ప్లే స్కూళ్లు
- నిబంధనలు బేఖాతరు చేస్తున్న యాజమాన్యాలు



నిజామాబాద్ అర్బన్ : ప్రైవేట్ పాఠశాలలు, ప్లే స్కూళ్లు జిల్లాలో విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. అనుమతులు లేకుండా ఏర్పాటవుతున్న ఆ పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ సైతం కొనసాగుతుండడం విశేషం. అనుమతి లేని పాఠశాలలపై ఇటీవల విద్యార్థి సంఘాలు జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన కరువైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అటు విద్యార్థులు, ఇటు వారి తల్లిదండ్రులు మోసపోతున్నారు.

నిబంధనలు ఏమిటి?

స్కూళ్లను ప్రారంభించాలనుకునేవారు ముందుగా జిల్లా విద్యాశాఖ అధికారి లేదా సంబంధిత మండల విద్యాశాఖాధికారి అనుమతి పొందాల్సి ఉంటుంది. అధికారుల పరిశీలన అనంతరం అనుమతి మంజూరు చేస్తారు. కానీ నిబంధనలు ఏమీ లేకుండానే నివాస భవనాల్లో కొందరు ప్లే స్కూళ్లను కొనసాగిస్తున్నారు.

కనీస సౌకర్యాలు కరువు

నివాస భవనాల్లో కొనసాగుతున్న ప్లే స్కూళ్లలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ఆర్మూర్ రోడ్డులోని ఓ అద్దె ఇంట్లో కొనసాగుతున్న ప్లే స్కూల్‌లో ఒకే గదిలో 40 మంది విద్యార్థులను కూర్చోబెడుతున్నారు. ఇక్కడ ఒకే వాష్‌రూం ఉంది. కంఠేశ్వర్ హౌసింగ్ బోర్డు కాలనీలో పాత భవనానికి రంగులు వేసి స్కూల్‌ను నడుపుతుండగా, మారుతినగర్‌లో భవనాన్ని అద్దెకు తీసుకొని మరో ప్లే స్కూల్ రెండు గదుల్లోనే 42 మందికి విద్యార్థులను కూర్చోబెడుతున్నారు. విద్యార్థులకు ఆట వస్తువులు, తాగునీరు విడివిడిగా వాష్‌రూమ్‌లు అందుబాటులో లేవు. ఒక్కో స్కూల్‌లో 40 మంది విద్యార్థులకు ఒక ఆయా, ఇద్దరు ముగ్గురు టీచర్లు ఉన్నారు.

- ■ నగరంలోని వినాయక్‌నగర్‌లో కొనసాగుతున్న ఓ కార్పొరేట్ స్కూల్‌లో 8 నుంచి 10వ తరగతి వరకు పర్మిషన్ లేదు.
- ■ వినాయకనగర్, కంఠేశ్వర్, సుభాష్‌నగర్ ప్రాంతంలో ఇటీవల ఏర్పాటు చేసిన ప్రైవేట్ పాఠశాలలకు అనుమతి లేదు.
- ■ అనుమతులు లేకుండా ఆటోనగర్‌లో ఓ ప్రైవేట్ పాఠశాల 6 నుంచి 10వ తరగతి వరకు కొనసాగుతోంది. ఇదే ప్రాంతంలో మరో పాఠశాల షిఫ్టింగ్ అనుమతి లేకుండా నడుస్తోంది.
- ■ ఈ ఏడాది జిల్లాలో కొత్తగా 15 వరకు ప్లే స్కూళ్లు ప్రారంభం కాగా, వీటికి అనుమతులు లేవు.
- ■ జిల్లా కేంద్రంలోని గంగాస్థాన్‌లో ఈ ఏడాది కొత్తగా ప్రారంభించిన రెండు ప్లేస్కూళ్లు పర్మిషన్ లేకుండానే కొనసాగుతున్నాయి.
- ■ కంఠేశ్వర్ హౌసింగ్ బోర్డు కాలనీలో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తీసుకొని స్కూల్‌ను నడుపుతుండగా దీనికి అనుమతి లేదు.
- ■ సుభాష్‌నగర్‌లో ఓ ప్రభుత్వ టీచర్ ఇల్లు అద్దెకు తీసుకొని పర్మిషన్ లేకుండా ప్లే స్కూల్ నిర్వహిస్తున్నారు.
- ■ ఆర్మూర్‌లో ఓ రిటైర్డ్ టీచర్ మూడేళ్లుగా అనుమతి లేకుండా ప్లేస్కూల్‌ను నడుపుతున్నారు.
- ■ నిజామాబాద్ నగర శివారులోని రెసిడెన్షియల్ భవనాల్లో అనుమతి లేకుండా కొనసాగుతున్న రెండు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

అనుమతి లేకుండా ప్రైవేట్ పాఠశాలలు, ప్లే స్కూళ్లు కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటాం. తల్లిదండ్రులు సైతం అనుమతి లేని పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించొద్దు.

– అశోక్, డీఈవో

బోనస్ బొక్కేశారు!

- రైతుల పేరుతో కోటగిరి సొసైటీలో మాయాజాలం
- పారదర్శకంగా విచారణ చేపట్టాలని విపక్షాల డిమాండ్
- వ్యవసాయం చేయని వారి ఖాతాల్లో డబ్బు జమ చేశారని ఆందోళనలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలోని కోటగిరి సింగిల్ విండోలో రైతుల పేరుతో బోనస్‌ను బొక్కేశారు. సన్నాలు సాగు చేసే రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్‌ను ప్రకటించి అందించిన విషయం తెలిసిందే. అయితే ఖరీఫ్ సీజన్ పంట చేతికొచ్చిన సమయంలో వర్షాల భయంతో చాలా మంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యాన్ని విక్రయించేశారు. దీన్నే అవకాశంగా మల్చుకున్న సొసైటీ చైర్మన్, మాజీ సర్పంచ్, ముగ్గురు కాంగ్రెస్ నాయకులు, ఐదుగురు మిల్లర్లు, అసలు వ్యవసాయమే చేయని ఇద్దరు ప్రైవేటు వ్యక్తులు కలిసి సుమారు రూ.20 లక్షలు కాజేశారని సమాచార హక్కు చట్టం ద్వారా ఈ స్కామ్‌ను బీజేపీ నాయకుడు వేముల నవీన్ బయటికి తీసుకొచ్చారు. దీనిపై బీజేపీ, సీపీఐ నాయకులు ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నారు.

వర్షాల భయంతో ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను సేకరించిన అక్రమార్కులు.. వారంతా సొసైటీకి ధాన్యం విక్రయించినట్లు రికార్డులు సృష్టించారు. ఆ తరువాత తమ మాయాజాలంతో బోనస్‌ను ఖాతాల్లోకి జమ చేసుకున్నట్లు విపక్షాలు ఆరోపిస్తున్నాయి. రూ.1,60,000, రూ.2,83,000, రూ.6,55,000, రూ.3,05,000, రూ.2,10,000, రూ.2,60,000, రూ.1,82,000 చొప్పున సదరు వ్యక్తులు, మిల్లర్లు బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించినట్లు ఆ రోపణలు వచ్చాయి. బోనస్‌ను బొక్కేసినట్లు అదనపు కలెక్టర్ విచారణలో ప్రాథమికంగా తేలడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. సహకార శాఖకు చెందిన సీనియర్ ఇన్‌స్పెక్టర్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఇందుకు సంబంధించి వేగవంతంగా విచారణ పూర్తి చేయాలని బీజేపీ, సీపీఐ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఇందులో భాగంగా బుధవారం సహకార సంఘం వద్ద సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. విజిలెన్స్ విచారణ చేపట్టాలని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రైస్ మిల్లులకు సీఎంఆర్ ధాన్యం కేటాయించొద్దని డిమాండ్ చేశారు. ఇలా వరుస ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. దీనిపై అదనపు కలెక్టర్ కిరణ్‌ను 'సాక్షి' వివరణ కోరగా విచారణ చేయిస్తున్నామన్నారు.



కోటగిరి సొసైటీ ఎదుట బుధవారం ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, రైతులు

ఇద్దరు పిల్లలతో కలిసి తండ్రి ఆత్మహత్యాయత్నం

- బాసర గోదావరి వద్ద కాపాడిన పోలీసు కానిస్టేబుల్

బాసర : గోదావరి నదిలో పిల్లలతో కలిసి దూకేందుకు యత్నించిన వ్యక్తికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ బోయగల్లికి చెందిన కోమటి గంగప్రసాద్, భార్య లక్ష్మి నిజామాబాద్‌లోని బట్టల దుకాణంలో పని చేస్తుంటారు. వారికి ఇద్దరు ఆడపిల్లలు వర్షిణి, రక్షిత ఉన్నారు. కుటుంబ సమస్యల కారణంగా ఇద్దరు పిల్లలను తీసుకుని వచ్చిన గంగప్రసాద్ బాసర గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మోహన్‌సింగ్ గమనించి హుటాహుటిన వారి వద్దకు చేరుకున్నాడు. గంగప్రసాద్‌ను, అతడి ఇద్దరు పిల్లలను దగ్గరికి తీసుకొని ఓదార్చాడు. గంగప్రసాద్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించి వారిని అప్పగించారు. కానిస్టేబుల్ మోహన్‌సింగ్‌ను ఎస్సై గణేశ్, ఇతర సిబ్బంది అభినందించారు.

సన్నబియ్యం పంపిణీపై ఫిర్యాదులు రావొద్దు

- సాఫీగా సాగేలా అధికారులు పర్యవేక్షించాలి
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



రేషన్ కార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : సన్నబియ్యం పంపిణీ సాఫీగా సాగేలా పకడ్బందీగా పర్యవేక్షించాలని, ఏ దుకాణంలోనూ బియ్యం నిల్వలు లేవనే ఫిర్యాదులు రావొద్దని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. నిజామాబాద్ నగరంలోని శివాజీనగర్‌లో ఉన్న 21వ నంబర్ రేషన్ దుకాణాన్ని కలెక్టర్ బుధవారం సందర్శించి లబ్ధిదారులకు స్వయంగా సన్న బియ్యం పంపిణీ చేశారు. బియ్యం నాణ్యత, స్టాక్‌ను సరిచూశారు. బయోమెట్రిక్ ద్వారా కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న విధానాన్ని గమనించి తన వెంట ఉన్న అధికారులకు కీలక సూచనలు చేశారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రేషన్ దుకాణాలలో సన్న బియ్యం నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అన్నారు. జిల్లాలో మంగళవారం నుంచి సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభమైందని, బుధవారం మధ్యాహ్నం వరకు 3183.095 మెట్రిక్ టన్నుల పంపిణీ పూర్తయ్యిందని తెలిపారు. కలెక్టర్ వెంట సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, సహాయ అధికారి రవిరాథోడ్, రేషన్ డీలర్ హిమబిందు, రేషన్ డీలర్ల సంఘం జిల్లా కార్యదర్శి పార్థసారథి, నగర కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి విక్కీ యాదవ్ తదితరులున్నారు.

రేషన్ షాపుల తనిఖీ

జిల్లాకేంద్రంలోని చంద్రశేఖర్ కాలనీలో ఉన్న 23, 31వ నంబర్ రేషన్ దుకాణాలను అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఎంత పరిమాణంలో బియ్యం పంపిణీ చేశారు, ఇంకా ఎంత మందికి పంపిణీ చేయాల్సి ఉంది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా బియ్యం పంపిణీ జరిగేలా చూడాలని రేషన్ డీలర్లు సంధ్యారాణి, గంగామణిని ఆదేశించారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

డీజిల్ లెక్క.. ఇక పక్కా..

- మున్సిపల్ వాహనాల్లో నెలకు వెయ్యి లీటర్ల డీజిల్ వినియోగం
- డీజిల్ గోల్‌మాల్‌కు చెక్ పెట్టేలా కమిషనర్ నిర్ణయం
- పోలీస్ పెట్రోల్ బంక్‌తో ఒప్పందానికి కృషి



పెట్రోల్ బంకులో బల్దియా వాహనాలు (ఫైల్)

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ వాహనాల డీజిల్ లెక్క ఇకపై పక్కాగా సాగనుంది. డీజిల్ పోసే పెట్రోల్ బంక్ నిర్వాహకులతో లాలూచీకి బ్రేక్ పడబోతోంది. డీజిల్ పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. అందులో భాగంగా బల్దియాలోని పారిశుధ్య వాహనాలకు వినియోగించే డీజిల్‌ను పోలీసు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే పెట్రోల్ బంక్‌లోనే పోయించనున్నారు. అందుకోసం మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, సీపీ సాయి చైతన్యతో మాట్లాడినట్లు సమాచారం. త్వరలోనే అగ్రిమెంట్‌పై సంతకం కూడా చేయనున్నట్లు తెలిసింది. ప్రజాప్రతినిధుల, అధికారుల వాహనాలకు డీజిల్ పోసే ఆటలు ఇక మీదట సాగే అవకాశం లేకుండా కమిషనర్ చెక్ పెట్టనున్నారు.

చెత్త సేకరణకు 137 వాహనాలు

చెత్త సేకరణ కోసం మొత్తం 137 వాహనాలున్నాయి. వీటిలో 20 వాహనాల వరకు షెడ్డుకు పరిమితమయ్యాయి. వాడే వాహనాల్లో నుంచి ప్రతిరోజూ పది వాహనాల వరకు రిపేర్ల పేరుతో షెడ్డు లోనే ఉంటున్నాయి. కేవలం 100 వరకు వాహనాలు చెత్త సేకరణకు వెళ్తున్నాయి. కానీ ప్రతిరోజూ వెయ్యి లీటర్ల డీజిల్ పోయిస్తున్నట్లు లెక్క చూపుతున్నారు. డీజిల్ పేరుతో ప్రతినెలా రూ. 30లక్షల బిల్లు డ్రా చేస్తున్నారు. ప్రతి నెలా డీజిల్ డబ్బుల చెల్లింపు వ్యవహారం అధికారులకు తలనొప్పిగా మారింది.మరోవైపు బిల్లులు చెల్లించినా డీజిల్ తక్కువ పోస్తున్నారని డ్రైవర్లు ఆందోళనకు దిగుతున్నారు.

సొంతానికి టోకెన్లు

డీజిల్‌ను కేవలం బల్దియాలోని వాహనాలకు మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. కానీ, కొందరు పారిశుధ్య సిబ్బంది, ఇన్‌స్పెక్టర్లు డీజిల్ టోకెన్లను సొంతానికి వాడుకుంటున్నారు. వాహనాల డ్రైవర్ల ద్వారా వాటిని తెప్పించుకొని తమ వాహనాల్లో డీజిల్ పోయించుకుంటున్నారు. ప్రత్యేకంగా టోకెన్ వ్యవస్థ ఉన్నా.. నిర్వాహకులు మాత్రం కొందరు ప్రజాప్రతినిధుల, మున్సిపల్ అధికారుల వాహనాలకు దొంగచాటుగా రోజుకు సుమారు 50 నుంచి 100 లీటర్ల వరకు పక్కదారి పట్టిస్తున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారం మొత్తం వాహనాల ఇన్‌చార్జికి తెలిసే జరుగుతోందనేది బహిరంగ రహస్యం. కొందరు డ్రైవర్లు సైతం డీజిల్‌ను బయటి వ్యక్తులకు, ఆటోలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

అధికారుల చేతివాటమే..



బల్దియా వాహనాల డీజిల్ విషయంలో శానిటేషన్ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వాహనాలు లేకున్నా టోకెన్లు ఇస్తున్నారు. దీంతో డీజిల్ పక్కదారి పడుతోంది. ఈ విషయమై పలుమార్లు డ్రైవర్లు ఆందోళన చేశారు.

– దండి వెంకట్, బీఎల్‌పీ నాయకుడు

అగ్రిమెంట్ జరగనుంది



మున్సిపల్ వాహనాలకు ఇకపై పోలీసు పెట్రోల్ బంక్‌లోనే డీజిల్ పోయిస్తాం. ప్రైవేట్ బంక్‌ల్లో పోయించినప్పుడు సమస్యలు వస్తున్నాయి. డ్రైవర్లు ఫిర్యాదులు చేస్తున్నారు. ఇకపై అవకతవకలు జరిగే ఆస్కారం ఉండదు.

– ఎస్.దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

ముగిసిన పదో తరగతి పరీక్షలు



పదో తరగతి పరీక్షలు ముగిశాయి. చివరి రోజైన బుధవారం సాంఘిక శాస్త్రం పరీక్షకు 22,743 మంది విద్యార్థులకుగాను 22,695 మంది హాజరుకాగా, 48 మంది గైర్హాజరయ్యారు. మార్చి 21న పరీక్షలు ప్రారంభంకాగా ఒకటిరెండు ఘటనలు చోటు చేసుకున్నాయి. నందిపేట మండల కేంద్రంలోని సెంటర్‌కు జిల్లా అబ్జర్వర్ తనిఖీకి వెళ్లిన సమయంలో ఇన్విజిలేటర్ చేతిలో చీటీలతో పట్టుబడ్డారు. దీంతో పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌తోపాటు ఇన్విజిలేటర్‌ను తప్పించారు. డిచ్‌పల్లి మండలం ధర్మారంలో పరీక్ష కేంద్రం సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను పోలీసులు విచారించి వదిలేశారు. ఈ రెండు ఘటనలు మినహా ప్రశాంతవాతావరణంలో పూర్తయ్యాయి.

– నిజామాబాద్ అర్బన్



పరీక్షలు ముగియడంతో కేరింతలు కొడుతున్న విద్యార్థులు

క్లుప్తంగా

ఓపెన్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

నిజామాబాద్ అర్బన్: ఈ నెల 20 నుంచి నిర్వహించే ఓపెన్ స్కూల్ 10వ తరగతి, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. తన చాంబర్‌లో బుధవారం విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. వేసవికాలం కావడంతో మంచినీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. అన్ని సెంటర్లలో మౌలిక సదుపాయాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, పరీక్షల విభాగం అధికారి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని అడ్డుకున్న పోలీసులు



నిజామాబాద్ రూరల్: వీరశైవ లింగాయత్ సమాజ్ సభ్యులు చేపట్టిన ర్యాలీకి అనుమతి లేకపోవడంతో బుధవారం రాత్రి పోలీసులు అడ్డుకున్నారు. నగరంలోని నాగారం 80 క్వార్టర్స్‌లోని నందిగుట్ట శివాలయం మంత్ర విగ్రహ, నందిగుట్ట శివాలయ నర్మదా బాణ లింగ పార్వతి మాత శిఖర ప్రతిష్ఠాపనోత్సవాలు ఈ నెల 1న ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా గాజుల్‌పేట్ గురుద్వార్ నుంచి వీరభద్ర స్వామి గుడి వరకు ర్యాలీ నిర్వహించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వీరశైవ లింగాయత్ సమాజ్ సభ్యులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న మూడు, రెండో టౌన్ ఎస్సైలు హరిబాబు, హన్మాండ్లు అక్కడికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

నిజామాబాద్ అర్బన్: గ్రంథాలయాల ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాలను తరచూ తనిఖీ చేస్తానని తెలిపారు. ఇటీవల విధుల్లో నిర్లక్ష్యం వహించిన కమ్మర్‌పల్లి గ్రంథాలయ ఉద్యోగి సందీప్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరుకావాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు మరో అవకాశం

- ఈ నెలాఖరు వరకు గడువు పొడిగింపు
- 25 శాతం రాయితీతో ఫీజు చెల్లింపునకు అనుమతి



మోర్తాడ్‌లో లే అవుట్ చేయని ఇంటి స్థలాలు

మోర్తాడ్(బాల్కొండ): లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్)కు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. లేఅవుట్ చేయని ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు మొదటి దశ గడువులో ప్రజల నుంచి స్పందన లభించడంతో ఏప్రిల్ 30వ తేదీ వరకు గడువు పొడిగించింది. ఇప్పటికే ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించిన అధికారులు ఆయా ప్రాంతాల్లో భూమి విలువ మేరకు ఫీజు నిర్ణయించారు. ఎల్‌ఆర్‌ఎస్‌తో ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూరుతుండడంతో ఆకర్షణీయమైన పథకాన్ని ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులో 25 శాతం రాయితీ కల్పించింది. ఇందులో భాగంగా మొదటి విడత గడువు గడిచిన మార్చి 31తో ముగిసింది. మిగిలిన దరఖాస్తుదారుల కోసం ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది.

వేలల్లో దరఖాస్తులు..

ఎల్‌ఆర్‌ఎస్ కోసం జిల్లా వ్యాప్తంగా వేలాది దరఖాస్తులు ప్రభుత్వానికి అందాయి. సుడాతోపాటు నిజామాబాద్ కార్పొరేషన్, భీమ్‌గల్, ఆర్మూర్, బోధన్ మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో చాలా మంది ఇండ్ల స్థలాలకు ఫీజును చెల్లించారు. కాగా, దరఖాస్తులను మూడు దశల్లో పరిశీలన చేసిన తర్వాత అధికారులు ప్రొసీడింగ్‌లు జారీ చేయనున్నారు.

రాయితీ సద్వినియోగం చేసుకోవాలి

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో 25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటి వరకు ఫీజు చెల్లించని వారు ఈ నెలాఖరులోగా ఆన్‌లైన్‌లో ఫీజును చెల్లించాలి. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లిస్తేనే ఇంటి నిర్మాణానికి అనుమతి లభిస్తుంది.

– శ్రీధర్, ఎంపీవో, మోర్తాడ్

ప్రజల అభ్యర్థన మేరకు.. : కలెక్టర్ హనుమంతు

నిజామాబాద్ అర్బన్: అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణ, ప్లాట్ల రెగ్యులరైజేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్‌ఆర్‌ఎస్ 25 శాతం రాయితీ సదుపాయాన్ని పొడిగించిందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. మార్చి 31నాటితో గడువు ముగియగా, ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ఏప్రిల్ 30వ తేదీ వరకు గడువు పొడిగించిందని అన్నారు. అర్హులైన వారందరూ ఈ వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 30వ తేదీలోగా నిర్ణీత రుసుము చెల్లిస్తే 25 శాతం రిబేటు వర్తిస్తుందని తెలిపారు.

నిజామాబాద్‌లో 33,729 దరఖాస్తులు

నిజామాబాద్ సిటీ: ఎల్‌ఆర్‌ఎస్ కోసం కార్పొరేషన్ పరిధిలో మొత్తం 33,729 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు 23,066 దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు మంజూరు చేశారు. వారికి ఫోన్లు చేసి సంబంధిత రుసుము చెల్లించుకోవాలని సూచించగా, 4,078 మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. దీంతో ఇప్పటి వరకు బల్దియాకు రూ.29.81 కోట్ల ఆదాయం వచ్చింది. కాగా, ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరివి తిరస్కరణకు గురయ్యాయి. సరైన డాక్యుమెంట్లు లేకపోవడం, ప్లాట్ నాలాలు, ప్రభుత్వ స్థలంలో ప్లాట్లు, కోర్టు కేసుల్లో ఉన్న భూములు, గ్రీన్‌జోన్‌లోకి వచ్చే స్థలాలు, మాస్టర్ ప్లాన్‌లోకి వచ్చే భూములు, పార్కు స్థలాలు, వంటి సమస్యాత్మక స్థలాలకు మాత్రం అనుమతులు నిలిచినట్లు అధికారులు తెలిపారు. 'చాలా మంది ఎల్‌ఆర్‌ఎస్ స్కీంను వినియోగించుకోలేదు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.' అని టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాసు తెలిపారు.

జిల్లా నాయకులతో కేసీఆర్ సమావేశం



బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బిగాల, జీవన్‌రెడ్డి తదితరులు

నిజామాబాద్ అర్బన్: బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు బుధవారం ఎర్రవల్లిలో జిల్లాకు చెందిన పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. మహాసభకు నాయకులు, కార్యకర్తల తరలింపుతో పాటు ఇతర అంశాలపై వారితో చర్చించి సలహాలు, సూచనలు చేశారు. గ్రామ, మండల, జిల్లా స్థాయి నాయకులు రజతోత్సవ మహాసభను విజయవంతం చేయడంలో ముఖ్యపాత్ర పోషించాలని సూచించారు. సమావేశంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా, ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

'హమ్మయ్య..పరీక్షలు ముగిశాయ్..'



పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గత నెల 21న ప్రారంభమైన పరీక్షలు బుధవారం వరకు కొనసాగాయి. చివరి పరీక్ష ముగియడంతో కేంద్రాల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు ఆనందంతో ఎగిరి గంతేశారు. హాస్టల్‌లో ఉంటూ చదివిన విద్యార్థులు సామగ్రి పట్టుకొని ఇళ్లకు బయల్దేరారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్–నిజామాబాద్







ప్రపంచంలో దేశాన్ని అగ్రభాగాన నిలపాలి



సదస్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న తెయూ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి తదితరులు

వీసీ ప్రొఫెసర్ టీ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): వ్యవసాయ, పారిశ్రామిక, సేవల రంగాల్లో అభివృద్ధిని పరుగెత్తించి ప్రపంచంలో దేశాన్ని అగ్రభాగాన నిలబెట్టేందుకు జాతీయ సదస్సు రూట్ మ్యాప్‌గా ఉపయోగపడాలని తెయూ వీసీ టీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ ఎం యాదగిరి అన్నారు. వర్సిటీ అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జూలై 17, 18వ తేదీల్లో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2047 నాటికి భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు పూర్తవుతున్న దృష్ట్యా అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు.

ఆర్థిక కార్యకలాపాల పెంపు ప్రక్రియలు, డిజిటల్ సాధనాల పురోగతితో 2047 నాటికి భారత దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారే ప్రయాణాన్ని ప్రభావితం చేసే కీలక రంగాలపై చర్చించేందుకు విద్యావేత్తలు, విధాన నిర్ణేతలు, పరిశోధకులు, పరిశ్రమల నిపుణులను సదస్సు ద్వారా ఒకచోట చేర్చడం అభినందనీయమని పేర్కొన్నారు. 'ఎంపవరింగ్ ఇండియా 2047: స్ట్రాటజీస్ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్' అనే జాతీయ అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సెమినార్ కన్వీనర్ ఏ పున్నయ్య తెలిపారు. ఈ సదస్సులో పరిశోధకులు, విద్యావేత్తలు, విద్యార్థులు పత్రాలను సమర్పించే అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలను వర్సిటీ వెబ్‌సైట్ www. telanganauniversity. ac. in లో పొందుపర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, కో కన్వీనర్ టీ సంపత్, అసోసియేట్ ప్రొఫెసర్ పాత నాగరాజు, స్వప్న, శ్రీనివాస్, దత్తహరి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సుభాష్‌నగర్ రామాలయ బ్రహ్మోత్సవాలు

- 40వ వార్షికోత్సవం నేపథ్యంలో 9వ తేదీ వరకు వరుస క్రతువులు
- 6న సీతారాముల కల్యాణం
- ప్లాస్టిక్ రహిత ఆలయంగా మార్చేందుకు ఏర్పాట్లు : చైర్‌పర్సన్ సరళామహేందర్‌రెడ్డి



బ్రహ్మోత్సవాల కోసం ముస్తాబైన నగరంలోని సుభాష్‌నగర్ రామాలయం



భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువపందిళ్లు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నగరంలోని సుభాష్ నగర్ శ్రీ రామాలయం 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి(గురువారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 9వ తేదీ వరకు బ్రహ్మోత్సవ కార్యక్రమ క్రతువులు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్‌పర్సన్ కాటిపల్లి సరళామహేందర్‌రెడ్డి తెలిపారు. 1986 ఏప్రిల్ 14న ఆలయ ప్రతిష్ఠ జరిగినట్లు ఆమె పేర్కొన్నారు. 40వ వార్షికోత్సవం పురస్కరించుకొని ఆలయంలో ప్లాస్టిక్ రహిత కార్యక్రమాలు నిర్వహించేందుకు స్టీల్ బ్యాంక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో స్టీల్ వస్తువులు సమకూర్చుకునేందుకు కార్యాచరణ మొదలైందన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ధృవమూర్తులకు స్నపన తిరుమంజనం, పంచామృతాభిషేకం, మంగళశాసనం, పుణ్యాహవచనము చేయనున్నట్లు పేర్కొన్నారు. 4న యగశాల ప్రవేశం, సుదర్శన కుంభస్థాపన, అగ్నిప్రతిష్ఠ, వాస్తు హోమం, గరుడ ప్రతిష్ఠ, ధ్వజారోహణం, 5న ఆవాహిత దేవతాపూజ, మూలమంత్ర జపహోమాలు, ఆంజనేయస్వామికి ఆకుపూజ, ఉలుకపూజ (కొట్నం పుణ్యాహవచనము), 6న నిత్యహోమం పారాయణాలు, ఆరగింపు, శ్రీరామ నవమి పురస్కరించుకొని శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. 7న అవధారయాలు (వేదాది విన్నపములు), రథ ప్రతిష్ఠ, బలిహరణం, రథోత్సవం, సాయంత్రం 7గంటలకు రథ ఊరేగింపు ఉంటాయని వెల్లడించారు. 8న శేష హోమం, అవభృధము, మహాపూర్ణాహుతి, దోపు ఉత్సవం, చక్రతీర్థం, ద్వాదశారాధన, శ్రీ ఆనంద పుష్పయాగం, సర్వదేవతా ఉద్వాసన, గరుడధ్వజ అవరోహణం, సప్తావరణ పూజ, ఏకాంత సేవ, 9న ఉదయం 9 నుంచి 11 గంటల వరకు శ్రీ సీతారామ చంద్రస్వామి మహా సామ్రాజ్య పట్టాభిషేకం, చతుర్వేద పారాయణ పరిసమాప్తి, మంగళశాసనము క్రతువులు నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ వివరించారు.

సార్లు.. మారండి మీరు

- నర్సింగ్ కాలేజీలో సమయపాలన పాటించని ఉద్యోగులు
- డీఎంహెచ్‌వో ఆదేశాలు బేఖాతరు



నర్సింగ్ కళాశాల గదులకు తాళాలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని నర్సింగ్ కాలేజీ ఉద్యోగుల తీరు విమర్శలకు దారి తీస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. డీఎంహెచ్‌వో ఒక వైపు పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లు, నర్సింగ్ కళాశాలలను తనిఖీ చేస్తూ సమయ పాలన పాటించాలని ఆదేశిస్తున్నా.. మార్పు రావడం లేదు. నగరంలోని జీజీహెచ్(ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి) ఆవరణలో ఉన్న నర్సింగ్ కాలేజీలో బుధవారం 10.30గంటల వరకు ఒకే ఒక్క అటెండర్ మినహా ఉద్యోగులెవరూ విధులకు హాజరుకాలేదు. లక్షల్లో వేతనాలు తీసుకుంటూ సమయపాలన పాటించడం లేదని, ఉద్యోగులు రాకపోవడంతో విద్యార్థులు సైతం సక్రమంగా హాజరు కావడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు.

అక్రమ తవ్వకాలు.. అడ్డుకుంటే దాడులు

- జోరుగా మొరం అక్రమ రవాణా
- రాజకీయ అండతో దాడులకూ వెనుకాడని వైనం
- పెట్రోలింగ్ పోలీసులపై దాడి.. కేసు నమోదు



డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో నిలిపి ఉంచిన మొరం టిప్పర్

డిచ్‌పల్లి: మొరం, ఇసుక అక్రమ రవాణాదారులు చెలరేగిపోతున్నారు. గోరంత అనుమతులు తీసుకొని కొండంత మొరం తవ్వకాలు సాగిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే దాడులకు సైతం వెనుకాడడం లేదు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల పేరు చెప్పుకుంటూ అధికారులపై ఒత్తిడి తెచ్చి మొరం, ఇసుక రవాణా అనుమతులు తీసుకుంటున్నారు. మొదట రోజుకు 5 నుంచి 10 ట్రిప్పులు రవాణా చేసేందుకు డీడీలు చెల్లించి వే బిల్లులు తీసుకుంటారు. ఆ తర్వాత రోజంతా 40 నుంచి 50 ట్రిప్పులు మొరం తరలిస్తున్నారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే పేరు చెప్పుకొని డిచ్‌పల్లి మండలంలోని నలుగురు వ్యాపారులు రెవెన్యూ అధికారుల నుంచి మొరం తరలింపు కోసం అనుమతులు తీసుకున్నారు. వీరిలో ఇద్దరు రోజుకు 9 టిప్పర్ల ద్వారా 18 ట్రిప్పులు, మరో ఇద్దరు 4 టిప్పర్ల ద్వారా 8 ట్రిప్పులు మొరం రవాణాకు అనుమతి పొందారు. అయితే అనుమతికి మించి మొరం రవాణా చేపడుతున్నారు. వే బిల్లులను తనిఖీ చేసే వారు లేకపోవడంతో ఒకే బిల్లుపై కనీసం 10 ట్రిప్పులు సరఫరా చేస్తుంటారు. కొద్ది రోజులుగా పగటి పూటే కాకుండా రాత్రిళ్లు కూడా మొరం అక్రమ రవాణా జోరుగా కొనసాగిస్తున్నారు.

అడ్డుకుంటే బెదిరింపులు

ఇటీవల డిచ్‌పల్లి ఖిల్లా గ్రామానికి చెందిన రైతులు మొరం టిప్పర్ల రాకపోకలతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయని, పంట పొలాలకు నష్టం వాటిల్లుతుందని టిప్పర్లను అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో మొరం తవ్వకాలు జరుగుతున్న స్థల యజమాని టిప్పర్లను అడ్డుకుంటే వాటిని మీపైకి ఎక్కించాల్సి ఉంటుందని బెదిరించాడంటూ వీడీసీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయం మరువక ముందే రెండు రోజుల క్రితం మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో అర్ధరాత్రి పెట్రోలింగ్ చేస్తున్న పోలీస్ సిబ్బంది మొరం తరలిస్తున్న టిప్పరును ఆపి వేబిల్లు అడిగారు. దీంతో టిప్పర్ డ్రైవర్ అదే గ్రామానికి చెందిన యజమానికి ఫోన్ చేయడంతో అక్కడికి చేరుకున్న యజమానికి పోలీసులతో గొడవ పడడమే కాకుండా దాడి చేశాడు. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చిన పోలీసులు, వారి ఆదేశాలతో మొరం టిప్పర్లను స్టేషన్‌కు తరలించారు. పోలీసులపై దాడికి పాల్పడిన నరేష్ అలియాస్ బాబీపై బీఎన్‌ఎస్ 303 క్లాజ్ 2, 132, 121 క్లాజ్ 1, 351 క్లాజ్ 2, 3 ఆఫ్ పీడీ పీపీ యాక్ట్, సెక్షన్ 21 క్లాజ్ 1, ఎంఎం డీఆర్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. టిప్పర్ డ్రైవర్ నాగేశ్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు డిచ్‌పల్లి ఎస్సై ఎండీషరీఫ్ తెలిపారు. టిప్పర్ యజమాని నరేశ్ అలియాస్ బాబీని బుధవారం రాత్రి రిమాండ్‌కు తరలించినట్లు డిచ్‌పల్లి సీఐ కే మల్లేశ్, ఎస్సై–2 సత్యం తెలిపారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం, వారిపై దాడి చేయడం, ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడం, చోరీ చేయడం నేరమని పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కంఠేశ్వర్ బైపాస్ వద్ద గల డీమార్ట్ ఎదుట గుర్తు తెలియని మహిళ(60) మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్సై–2 ఆనంద్‌సాగర్ తెలిపారు. గంగాస్థాన్‌కు చెందిన బిన్ని అనే యువతి అటువైపుగా వెళ్లడంతో మృతదేహం ఉన్నట్లు గమనించి సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించామని తెలిపారు. బిన్ని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై–2 పేర్కొన్నారు.

పేకాడుతున్న నలుగురు అరెస్ట్

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం శ్రీ రాజరాజేశ్వరీనగర్‌లో బుధవారం పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ. 10,260 నగదుతోపాటు 4 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

క్రైం కార్నర్

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

వేల్పూర్: వేల్పూర్ మండలం పచ్చలనడుకుడ గ్రామంలో గత నెల 22న జరిగిన హత్య కేసులో నిందితుడిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆర్మూర్ రూరల్ సీఐ కే శ్రీధర్ తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన బాలాజీ కొన్నేళ్లుగా పచ్చలనడుకుడలో నివాసముంటూ కూలి పని చేసుకొని జీవిస్తున్నాడు. మహారాష్ట్రకు చెందిన అతని స్నేహితుడు శంకర్ సైతం అతని వద్దకే వచ్చి కూలి పని చేసుకుంటున్నాడు. వ్యక్తిగత విషయాల్లో ఇరువురి మధ్య బేధాభిప్రాయాలు రావడంతో మద్యం సేవించి గొడవపడ్డారు. శంకర్‌పై కోపం పెంచుకున్న బాలాజీ అతనిపై తీవ్రంగా దాడి చేసి కొట్టడంతో చనిపోయాడు. దీంతో బాలాజీ వెంటనే మహారాష్ట్రకు పారిపోయాడు. నిందితుడు తిరిగి వేల్పూర్ నుంచి పచ్చలనడుకుడకు వెళ్లే క్రమంలో గుర్తించి పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. బాలాజీపై ఇదివరకే మహారాష్ట్రలో మర్డర్ కేసు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. సీఐ వెంట వేల్పూర్ ఎస్సై సంజీవ్ ఉన్నారు.

న్యూసెన్స్ కేసు నమోదు



ఎల్లారెడ్డి: రోడ్డుపై న్యూసెన్స్ చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై మహేశ్ హెచ్చరించారు. మంగళవారం రాత్రి బర్త్‌డే పార్టీ పేరిట రోడ్డుపై కేక్ కట్ చేస్తూ న్యూసెన్స్ క్రియేట్ చేయడంతోపాటు బీరు సీసాలు కలిగి ఉన్న యువకులపై కేసు నమోదు చేశామన్నారు. యువకులతోపాటు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

అల్ప్రాజోలం కేసులో మరో నిందితుడి అరెస్టు

కామారెడ్డి క్రైం: నిషేధిత అల్ప్రాజోలం మత్తు మందు రవాణా, విక్రయం కేసులో మూడు రోజుల క్రితం మద్నూర్ మండల కేంద్రానికి చెందిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో పరారీలో ఉన్న మద్నూర్‌కు చెందిన మరో నిందితుడు, ఓ ప్రముఖ దినపత్రికలో పనిచేస్తున్న విలేకరి పయ్యావ్ల శ్రీనివాస్‌గౌడ్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన క్రిష్ణా అనే వ్యక్తి వద్ద నుంచి అల్ప్రాజోలంను కొనుగోలు చేసి మద్నూర్‌లోని అతని కల్లు దుకాణంలో ఉపయోగించే వాడని వెల్లడించారు. ఎవరైనా మత్తుపదార్థాలను కలిగి ఉన్నా, సరఫరా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

బాలుడు అదృశ్యం



సాహిల్‌ఖాన్

బోధన్ టౌన్ (బోధన్) : బోధన్ పట్టణంలో బాలుడు అదృశ్యమైనట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు. పట్టణానికి చెందిన షర్ఫుద్దీన్ కుమారుడు సాహిల్ ఖాన్(12) మంగళవారం ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి సైకిల్‌పై బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆచూకీ తెలిస్తే 87126 59870, 97081 45311 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

నగరంలో కత్తిపోట్ల కలకలం

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. ఎస్సై వెంకట్రావు తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ రోడ్డులోని నిజాంసాగర్ కెనాల్ కట్ట ప్రాంతానికి చెందిన షేక్ గౌస్‌పై ముగ్గురు యువకులు బుధవారం సాయంత్రం కత్తులతో దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడ్డ షేక్ గౌస్‌ను జీజీహెచ్‌కు తరలించారు. పాతకక్షల నేపథ్యంలోనే గౌస్‌పై యువకులు దాడికి పాల్పడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కత్తితో బెదిరించిన యువకుడి అరెస్టు..



నిందితుడు అల్తాఫ్

ఖలీల్‌వాడి: డబ్బుల కోసం కత్తితో బెదిరించిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. నగరంలోని అహ్మద్‌పురా కాలనీకి చెందిన షేక్ అల్తాఫ్ గత నెల 31న బోధన్ రోడ్‌లోని దుర్గా వైన్స్ వద్ద సతీశ్ రెడ్డి, కోలం నాగరాజును కత్తితో బెదిరించి డబ్బులు డిమాండ్ చేశాడు. వైన్స్ యజమాని పసునూరి విశ్వాక్‌కాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అల్తాఫ్‌పై గతంలో మహారాష్ట్రలోని ముఖ్కేడ్ పోలీస్ స్టేషన్‌లో హత్యానేరం కేసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తి..



నిందితుడు ఖలీం

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కత్తితో దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ బుధవారం తెలిపారు. గత నెల 31న రాత్రి 11:30 గంటలకు పాటిగల్లీకి చెందిన మహమ్మద్ ఖలీమ్ అదే కాలనీకి చెందిన అబ్బాస్ అలీ బేగ్‌ను గాయపరిచాడన్నారు. అబ్బాస్ అలీ బేగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి, అతని వద్ద ఉన్న కత్తిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.